క్లుప్తంగా

సే'వా' లంటీర్



రాధాకృష్ణవేణికి పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ విజయసాగర్

గుంటూరు రూరల్: నిత్యం సేవా దృక్పథం, సేవకు ప్రతిరూపంగా వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించటంలో దూసుకుపోతున్నారు. వెంగళాయపాలెం గ్రామ సచివాలయం 2 కు చెందిన వలంటీర్ రేటూరి విజయసాగర్ సేవా దృక్పథాన్ని చాటుకున్నాడు. గ్రామానికి చెందిన రావిపాటి రాధాకృష్ణవేణి అనే 90 ఏళ్ళ వృద్ధురాలు గ్రామ క్లస్టర్ 13లో నివాసం ఉండేవారు. గత కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్య సేవల నిమిత్తం హైదరాబాదులోని భందువుల ఇంట్లో ఉంటూ వైద్యం తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఉన్నారని తెలిసిన వలంటీర్ తన సొంత ఖర్చులతో హైదరాబాదుకు వెళ్ళి రాధా కృష్ణవేణికి పింఛన్‌ను అందించి వచ్చాడు. సేవా దృక్పథంతో హైదరాబాదు వెళ్ళి పింఛన్‌ను అందించిన వలంటీర్‌ను గ్రామ ప్రజలు తోటి వలంటీర్లు, గ్రామ సచివాలయం ఉద్యోగులు అభినందించారు.

పెదకాకాని ఏరియా నోటరీ ఆఫీసర్‌గా కారంకి



పెదకాకాని: న్యాయవాది కారంకి లక్ష్మీనారాయణను పెదకాకాని మండల ఏరియాకు నోటరీ ఆఫీసరుగా నియమిస్తూ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా కోర్టులలో సుమారు 30 సంవత్సరాలుగా పనిచేసిన కారంకి లక్ష్మీనారాయణ 2006లో గుంటూరులోని ఎస్సీ, ఎస్టీలపై అత్యాచార నిరోధక స్పెషల్ కోర్టు, 4వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టుకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమింపబడ్డారు. ఐదేళ్ళ పాటు సేవలందించిన ఆయన తొలిసారి 2013లో పెదకాకాని మండల ఏరియాకు నోటరీ ఆఫీసర్‌గా సేవలందించారు. అలాగే 2018లో తిరిగి రెన్యువల్ కాబడి నోటరీ ఆఫీసరుగా సేవలు కొనసాగించారు. 2023 అక్టోబరులో పదవీకాలం ముగియనుండగా రాష్ట్ర ప్రభుత్వం కారంకి సేవలు గుర్తించి మండల ఏరియా నోటరీగా నియమించడం జరిగింది.

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం



విద్యార్థులతో కలిసి మధ్యాహ భోజనం చేస్తున్న ఎంఈఓ కెనడీ

కాకుమాను: మెనూ ప్రకారం ప్రతి రోజు విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం ఎంఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి మధ్యాహ్న భోజన పథకంలో అనేక మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. పాఠశాలలకు పంపిన మెనూ ప్రకారంగా ప్రతి రోజు విద్యార్థులకు భోజనాన్ని అందించాలని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

సీతాలమ్మ గోమాత అంతిమయాత్ర



చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలోని గ్రామ దేవత సీతాలమ్మతల్లికి చెందిన ఆవు బుధవారం ఆకస్మికంగా మరణించింది. గత పది సంవత్సరాలుగా గ్రామంలోని భక్తులు దైవంగా కొలిచే గోమాత మృతి చెందటంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతిమ యాత్రలో స్థానికులు అధిక సంఖ్యలో హాజరై మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. వేలాది మంది తరలివచ్చారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం

- జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి
- ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు
- ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా మెరుగైన కార్పొరేట్ వైద్యం
- మంచి మనసుతో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు



ప్రజలకు అందుతున్న వైద్య సేవలు పరిశీలిస్తున్న కలెక్టర్



తక్కెళ్ళపాడు ఆరోగ్య శిబిరానికి హాజరైన ప్రజలు



ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు



చేబ్రోలు-3 గ్రామ సచివాలయం వద్ద వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పొన్నూరు: ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటి వద్దనే వైద్య సేవలను అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పొన్నూరు మండలంలోని దొప్పలపూడి గ్రామం ప్రైమరీ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. వైద్య సేవలను, సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో సమూల మార్పులు చేసి, వాటన్నింటినీ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి భరోసా కల్పించేందుకు ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేశారని పేర్కొన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి నాణ్యమైన మందులు అందించడంతోపాటు, చికిత్స అవసరమయ్యే వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యశాలల్లో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా మెరుగైన వైద్యం అందించనున్నట్లు తెలిపారు. గతంలో ప్రజలకు వైద్య సేవలు అందాలంటే చాలా కష్టంగా ఉండేదని, డాక్టర్లు, వైద్య సిబ్బంది, మందులు ఉండని పీహెచ్‌సీలతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ ఇబ్బందులన్నీ తొలగిపోయాయని అన్నారు. ప్రస్తుతం పాత పీహెచ్‌సీల ఆధునీకరణతో పాటు, ప్రతి మండలంలో రెండు పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణాలు జరిగాయని, వాటిలో ఎల్లప్పుడూ ఇద్దరు డాక్టర్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వైద్య సిబ్బంది ఎంతో గొప్ప మనసుతో వైద్య సేవలందిస్తున్నారని, ప్రజలు సంతోషంగా ప్రభుత్వ సేవలను పొందుతున్నారని అన్నారు. ప్రజలకు సేవ చేయడంలో ఇంతటి మంచి కార్యక్రమంలో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, వలంటీర్లను భాగస్వాములను చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పేద ప్రజలకు మంచి చేయాలని, అర్హత గల కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా చేయూత అందిస్తున్నారన్నారు. ఆరోగ్య విషయంలో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టడం జరిగిందని, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి వైద్య శిబిరాల సమాచారం ప్రజలకు చేరవేయడం జరుగుతుందన్నారు. విద్యా, వైద్యం, సచివాలయాలు, రైతు సేవలను గడప గడపకు తీసుకొని వచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్ళజోళ్ళు, అర్హులైన వారికి పీఎంజేఏవై కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, పొన్నూరు మండల నోడల్ ఆఫీసర్, పశు సంవర్ధక శాఖ జేడీ వెంకటేశ్వర్లు, దొప్పలపూడి సర్పంచ్ కే రమేష్, ఎంపీపీ భవనం పద్మ లీల, ఎంపీడీఓ శ్రీనివాస రావు, ప్రజా ప్రతినిధులు, వైద్యాధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. పొన్నూరు పట్టణంలోని సాంబశివ నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, నాయకులు అమిరినేని సాంబశివ రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి భరోసా..

చేబ్రోలు: ప్రజల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని చేబ్రోలు-3 గ్రామ సచివాలయం పరిధిలో గల చెరువులోపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిని జల్లెడ పట్టి, ప్రతి ఒక్కరికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షల ద్వారా అనారోగ్య సమస్యలను గుర్తించి వారికి ఉచితంగా వైద్యం, మందులు అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నేడు ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ ద్వారా కరోనా కష్టకాలంలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించగలిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో బి.బాబురావు, గ్రామ సర్పంచ్ అత్తోట వినీతా రాణి, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, వైద్యాధికారి అబ్రహం లింకన్, ఉప సర్పంచ్ జి.చౌడయ్య, మండల పార్టీ అధ్యక్షుడు షేక్ పెద మస్తాన్, కె.కిరణ్‌కుమార్, బి విజయ కుమార్, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల కోసం ..

చేబ్రోలులోని ఉప్పరపాలెం ప్రాంతానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన జె.ఏడుకొండలు కొంత కాలం క్రితం పక్షవాతానికి గురయ్యాడు. ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందే స్థోమత లేక పోవటంతో జగనన్న సురక్ష కార్యక్రమంలోని మెడికల క్యాంప్‌లో భార్యతో కలిసి వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. అతనిని చూసిన పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అతని పరిస్థితిని తెలుసుకొని వైద్యాధికారి అబ్రహం లింకన్‌కు పలు సూచనలు చేశారు. గుంటూరు జీజీహెచ్‌కు కూడా రిఫర్ చేసినట్లు తెలిపారు. పెన్షన్ ఇప్పించాలని కోరగా ఎంపీడీవో బాబురావును పరిశీలించాని సూచించారు.



మెడికల్ క్యాంప్‌లో వైద్యసేవల కోసం వచ్చిన పక్ష వాతంతో బాధపడుతున్న జంపని ఏడుకొండలు

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే జగనన్న ఆరోగ్య సురక్ష

- తక్కెళ్ళపాడులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష
- వైద్య పరీక్షలతో పాటు స్పెషలిస్ట్ డాక్టర్లచే ఉచిత వైద్య సేవలు, మందుల పంపిణీ
- 262 మందికి వైద్య పరీక్షలు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య



తక్కెళ్ళపాడు జగనన్న ఆరోగ్య సురక్షలో పేర్లు నమోదు చేస్తున్న సిబ్బంది

పెదకాకాని: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న బృహత్తర కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 రోజుల పాటు నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష మెగా మెడికల్ క్యాంపును బుధవారం పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడం, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య సేవలు అందించడం, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమన్నారు. పేషెంట్ల సమస్య ఆధారంగా అవసరాన్ని బట్టి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఉన్న ఆసుపత్రులకు సిఫారసు చేసి వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రజలకు హెల్త్ క్యాంపుపై అవగాహన కల్పించడం, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నిపుణులైన వైద్యులచే వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరం ద్వారా 262 మందికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 90 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి వారిలో 75 మందికి కళ్ళజోడు అవసరం ఉన్నట్లు గుర్తించారు. శిబిరం ఏర్పాట్లను పెదకాకాని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పుసులూరి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ పి.ప్రవీణదీప్తి, డాక్టర్ వి.రాజేష్, డాక్టర్ ఎల్ అనూష, డాక్టర్ భవిష్యలు పేషెంట్లకు వైద్యసేవలు అందించారు. తక్కెళ్ళపాడులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ, ఎఫ్‌డీపీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఎంపీడీఓ ఎ.రామకృష్ణ, తహసీల్దార్ పి.రత్నం, మండల పార్టీ అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు మైనార్టీ డైరెక్టర్ సయ్యద్ సుబాని, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య రక్ష జగనన్న సురక్ష

నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చేకూరి కీర్తి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చేకూరి కీర్తి తదితరులు

గుంటూరు రూరల్: వార్డ్ సచివాలయాల వారీగా అనారోగ్య సమస్యలు ఉన్న ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్షని సద్వినియోగం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు అవగాహన కల్పించాలని నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం 26వ డివిజన్ చౌడవరం గ్రామంలో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను స్థానిక కార్పొరేటర్ శ్యామల వెంకటరమణదేవితో కలిసి పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి క్యాంప్ నిర్వహణపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష అనారోగ్య సమస్యలు ఉన్న వారికి గొప్ప అవకాశమన్నారు. ఎంతో ఖరీదైన వైద్యం, మందులు ఉచితంగా క్యాంప్‌లో అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే వార్డ్ సచివాలయం ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సురక్ష క్యాంప్‌పై అవగాహన కల్పించడం, అనారోగ్యంగా ఉన్న వారిని గుర్తించడం జరిగిందన్నారు. క్యాంప్‌లో మహిళలకు, పురుషులకు ప్రత్యేక కౌంటర్లు, సమాచారం కోసం వార్డ్ సచివాలయ కార్యదర్శిని నియమించడం, తాగునీరు, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశామన్నారు. మందులు ఇచ్చేందుకు కూడా కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. నేరుగా క్యాంప్‌లో స్పాట్ రిజిస్ట్రేషన్ చేసి తగిన వైద్య పరీక్షలు చేస్తున్నారన్నారు. ఎవరికైనా ఉన్నత వైద్యం అవసరమైతే ప్రభుత్వ లేదా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. క్యాంప్‌లో జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్‌తో పాటు ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. క్యాంప్ ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని, క్యాంప్‌లో డిప్యూటీ కమిషనర్లు, ఎంహెచ్ఓ, ప్రజారోగ్య అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఏ సమస్య ఎదురైనా వారిని సంప్రదించవచ్చని పేర్కొన్నారు. అనంతరం క్యాంప్‌లో కళ్ళు పరీక్ష చేయించుకొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సీహెచ్.శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఈఈ కొండా రెడ్డి, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రత్న మన్మోహన్, అంకిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి, మెడికల్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.



స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కీర్తి

సామూహిక ఎలుకల నివారణకు ప్రభుత్వం చర్యలు



ఎలుకల మందు పంపిణీ చేస్తున్న మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ వెంకటేశ్వరరావు

పెదకాకాని: రైతులందరి సహకారంతోనే సామూహిక ఎలుకల నిర్మూలన సాధ్యపడుతుందని మండల మానిటరింగ్ ఆఫీసర్, లాం ఫాం ఏడీఏ ఐ.సునీత అన్నారు. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు, నంబూరు గ్రామాలలో బుధవారం వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో ఎలుకల నివారణకు మందు తయారు చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ సునీత మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు వరి పంటలో ఎలుకల బొరియల వద్ద విషపు ఎర 10 గ్రాములు కాగితంలో ప్యాకెట్‌గా కట్టి పెట్టాలన్నారు. 11 రోజుల తరువాత రెండవసారి తిరిగి ఎలుకల మందు పెట్టినట్లయితే ఎలుకలు ఈ దశలో ఉన్న పంటను ఆశించకుండా కాపాడుకోవచ్చన్నారు. నూకలు 96 పాళ్ళు, బ్రోమోడయోలోన్ మందు రెండు శాతం, వేరుశనగనూనె కలిపిన మిశ్రమాన్ని రైతులకు పంపిణీ చేశారు. ఎలుకల మందు కలిపే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి, ఉప్పలపాడు ఎంపీటీసీ సభ్యురాలు దంతాల శివపార్వతి, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ దంతాల వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణ అధికారి ఆర్‌వీ శివాజీ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ

కాకుమాను: రైతులందరు సామూహికంగా ఎలుకల నివారణ మందును వాడి పూర్తి స్థాయిలో ఎలుకలను నివారించుకుని తమ పంటలను కాపాడుకోవాలని సర్పంచ్ చింతల రాహేలమ్మ అన్నారు. మండలంలోని గ్రామాలలో బుధవారం రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందు(బ్రోమోడయోలిన్)మందును పంపిణీ చేశారు. తెలగాయపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రాహేలమ్మ రైతులకు మందును పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరు ఒకేసారి తమ పంట పొలాల్లో ఎలుకల నివారణ మందును పెట్టి పూర్తి స్థాయిలో నివారించుకోవాలని అప్పుడే దిగుబడులు పెరుగుతాయని ఆమె సూచించారు. కాకుమాను గ్రామ సచివాలయం-1లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, జెడ్పీటీసీ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, పార్టీ జిల్లా కార్యదర్శి ముజావర్ షేక్ అసదుల్లా, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, ఎంపీటీసీ-2 కానుగుల పరమేశ్వరరావు, ఏఓ కె.కిరణ్మయి రైతులకు ఎలుకల మందును పంపిణీ చేశారు.

ఎలుకల నివారణపై రైతు అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: పంటల్లో ఎలుకల నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం జొన్నలగడ్డ గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద ఎలుకల నివారణకు రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, పంచాయతీ కార్యదర్శి భూషణం, వీఏఏ ఆనందబాబు, వంగా నవీన్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనకు మందు పంపిణీ

పొన్నూరు: పొన్నూరు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎలుకుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బ్రోమోడయోలీన్ మందు కలిపిన విషపు ఎరను రైతులకు పంపిణీ చేశారు. పచ్చల తాడిపర్రు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో మండల ఎంపీపీ భవనం పద్మలీల, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు పాల్గొని రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ లంక పోతు పిచ్చి రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి, మండల వ్యవసాయ అధికారి వెంకట్రామయ్య, రైతులు పాల్గొన్నారు.

పంటల్లో ఎలుకల నివారణపై అవగాహన

చేబ్రోలు: పంటను నాశనం చేసే ఎలుకల నివారణ కోసం రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గుంటూరు పెస్టిసైడ్స్ ల్యాబ్ ఏడీఏ సీహెచ్ తిరుమలాదేవి, పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి అన్నారు. చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో బుధవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టారు. విషపు ఎర తయారు చేసే విధానం ఒక హెక్టారుకు 480 గ్రాములు నూకలు, పది గ్రాముల బ్రోమోడయోలిన్ మందు, పది గ్రాముల వెజిటబుల్ ఆయిల్ కలిపి చిన్న చిన్న పొట్లాలను ఎలుక బొరియల దగ్గర ఉంచాలన్నారు. ఎలుకలను నిర్మూలించుకొని పైరు పిలకలు తొడిగే దశలో నష్టాన్ని నివారించుకోవచ్చునని తెలిపారు. స్థానిక ఏవో శ్రీనివాస నాయక్, వీఏఏలు రమ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ర్యాలీ



ఆటో డ్రైవర్లతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

కాకుమాను: తమ జీవితాలలో వెలుగునింపి ఏటా ఒక అన్నలాగ మా కష్టాలను తీరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పుడు రుణపడి ఉంటామని కాకుమాను ఆటో యూనియన్ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. మండల కేంద్రం కాకుమానులో ఇటీవల వాహనమిత్ర పథకం ద్వారా ఆటో డ్రైవర్లందరికీ రూ.పదివేల నగదును అందజేసిన సందర్భంగా కాకుమాను ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా నేనున్నానంటు ప్రతి ఏటా వివిధ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఆయన తెలిపారు. జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా క్రమం తప్పకుండా అనుకున్న సమయానికి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్న గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి అని ఆమె తెలిపారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో చేయని విధంగా పాలన చేస్తూ అందరికి న్యాయం చేస్తున్న మహోన్నత వ్యక్తి మన ముఖ్యమంత్రి అని కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలిలో ముఖ్యమంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివకుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ముజావర్ షేక్ అసదుల్లా, మాజీ సర్పంచ్ నన్నపనేని కిషోర్‌బాబు, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, ఎంపీటీసీ-2 కానుగుల పరమేశ్వరరావు, ఆటో యూనియన్ ఉపాధ్యక్షుడు జాన్ బాషా, నాగరాజు, సుబ్బారావు, ఆటో డ్రైవర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

గుంటూరు రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం నల్లకుంట 12వ లైనుకు చెందిన దొప్పల ప్రసన్నకుమార్(18) తండ్రి సత్యనారాయణ మిర్చియార్డు వద్ద చిన్న దుకాణం నిర్వహిస్తూ ఉంటాడు. ఈ క్రమంలో తెల్లవారుఝామున దుకాణం వద్దకు తన తల్లిని ద్విచక్రవాహనంపై దుకాణం వద్ద వదిలి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాతరెడ్డిపాలెంలో స్థల వివాదంకు చెక్

చేబ్రోలు: సుదీర్ఘకాలంగా వివాదాస్పదంగా ఉన్న స్థల విషయాన్ని బుధవారం రెవెన్యూ అధికారులు ఇరుపక్షాలకు అనుకూలంగా సమస్యను పరిష్కరించారు. చేబ్రోలు మండలం పాతరెడ్డిపాలెం గ్రామానికి చెందిన తాళ్లూరి దావీదుకు పూర్వీకుల నుంచి వచ్చిన ఇంటి స్థలం సమస్య జఠిలంగా మారటంతో సర్వే అధికారులకు వినతి పత్రం అందజేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం తాళ్లూరి దావీదు ఇంటి పట్టా లేదు. వారి స్వాధీనంలో ఉన్న స్థలం తాళ్లూరి గురవయ్య మరియు తాళ్లూరి నాగయ్య పేరిట మంజూరు చేయబడినట్లు అధికారులు గుర్తించారు. తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ పర్యవేక్షణలో రెవెన్యూ, సర్వే సిబ్బంది స్థల పరిశీలన చేసి అందరికి ఆమోద యోగ్యంగా దావీదుకు సరిహద్దులు గుర్తించారు. సర్వే ఆధారంగా స్థలంకు ఉమ్మడి బాటగా కొంత స్థలాన్ని కేటాయించటంతో సమస్యకు పరిష్కారం చూపారు.